13 వరకు సామూహిక ఆర్ట్ ఎగ్జిబిషన్ కొనసాగింపు

హైదరాబాద్ : ఢిల్లీకి చెందిన గ్యాలరీ డాట్‌వాక్ ఆధ్వర్యంలో సామూహిక ఆర్ట్ ఎగ్జిబిషన్ ప్రదర్శన కొనసాగుతోంది. హైదరాబాద్‌లోని కావూరి హిల్స్‌లోని మాధాపూర్ స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో సెప్టెంబర్ 6 నుంచి 13వ తేదీ వరకు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 5 గంటల వరకు ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

మూసీ ప్రక్షాళన చేసి తీరుతాం

- శ్రీపాద ఎల్లంపల్లి నుంచే గోదావరి జలాల తరలింపు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాలుష్యంతో నిండిపోయిన మూసీని ప్రక్షాళన చేసి తీరుతామని, విషతుల్యమైన మూసీతో బాధపడుతున్న నల్లగొండ వాసులకు మాట ఇచ్చానని.. ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటానని సిఎం రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. మూసీ ప్రక్షాళన కోసమే మూసీ రివర్ ఫ్రంట్‌ను ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు. నగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు గోదావరి తాగునీటి సరఫరా పథకాన్ని ప్రారంభించినట్టు ప్రకటించారు. సోమవారం రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం ఉస్మాన్‌సాగర్ వద్ద రూ.7,360 కోట్ల వ్యయంతో చేపట్టనున్న గోదావరి తాగునీటి సరఫరా పథకం ఫేస్ -2,3 పనులకు మంత్రులతో కలిసి సిఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రేవంత్‌రెడ్డి ప్రసంగించారు.

వందేండ్లకు పైగా ఈ నగరానికి తాగు నీరు అందుతున్నాయంటే ఆనాటి నిజాం సర్కార్ దూరదృష్టి కారణమని రేవంత్ అన్నారు. కోటికిపైగా జనాభా ఉన్న హైదరాబాద్ నగరానికి తాగునీరు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని గుర్తు చేశారు. 1965లో మంజీరా నది నుంచి, 2002లో కృష్ణా నది జలాలను మూడు దశల్లో నగరానికి తరలించి, ప్రజల దాహార్తిని తీర్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాలదేనని తెలిపారు. 20 టిఎంసిల గోదావరి జలాలను హైదరాబాద్‌కు తరలించబోతున్నామని, ఇందులో 16 టిఎంసిలను హైదరాబాద్ తాగునీటి కోసం, నాలుగు టిఎంసిలను చెరువులను నింపుకుంటూ మూసీకి తరలించి, మూసీని ప్రక్షాళన చేస్తామని అన్నారు. పదేండ్లు అధికారంలో ఉన్నవాళ్లు మూసీ నది ప్రక్షాళన ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. శ్రీపాద ఎల్లంపల్లి నుంచే గోదావరి జలాలను హైదరాబాద్‌కు తరలిస్తున్నామని, ఆ సంగతి మరిచిపోయి కొందరు మల్లన్నసాగర్ అని మాట్లాడుతున్నరని ఎద్దేవా చేశారు. తుమ్మిడిహెట్టి దగ్గర ప్రాణహిత చేవెళ్ల కట్టి ఆదిలాబాద్, రంగారెడ్డి జిల్లాల రైతులకు సాగునీరు అందిస్తామని చెప్పారు. త్వరలోనే మహారాష్ట్రకు వెళ్లి అక్కడ ముఖ్యమంత్రితో మాట్లాడుతానని అన్నారు. ప్రపంచ స్థాయి నగరంగా హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేస్తామని, దీనికి అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రైసింగ్-2047 విజన్ డాక్యుమెంట్‌ను డిసెంబర్ 9న తెలంగాణ సమాజానికి అంకితం ఇస్తామని ప్రకటించారు.

రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. హైదరాబాద్ మహా నగరాభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్‌లో మౌలిక సదుపాయాల కల్పనలో గత ప్రభుత్వం విఫలమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్లు, భవనాల శాఖ ఇఎన్‌సిగా మోహన్‌నాయక్

- మంత్రి అభినందన



మంత్రి కోమటిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మోహన్‌నాయక్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రోడ్లు, భవనాల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్‌గా జె.మోహన్‌నాయక్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆ శాఖ ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలో ఇఎన్‌సి మోహన్‌నాయక్ సోమవారం రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని హైదరాబాద్‌లోని మంత్రుల సముదాయంలో కలిశారు. తనపై నమ్మకంతో ఇఎన్‌సి బాధ్యతలు అప్పగించినందుకు మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఎస్‌ఇల నుంచి సిఇలుగా పదోన్నతి పొందిన ఎ కిషన్‌రావు, బి.లక్ష్మణ్, బి.వెంకటేశ్వర్‌రావు, ఎం.శ్రీనివాస్‌రెడ్డి సైతం మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ నమ్మకాన్ని నిలబెట్టాలని అన్నారు. ఆర్అండ్‌బి శాఖ బలోపేతంపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు.

బొల్లారంలో యువకుని దారుణ హత్య

హైదరాబాద్ బ్యూరో : సంగారెడ్డి జిల్లా బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని కెబిఆర్ కాలనీలో ఓ యువకుడిని దారుణంగా హత్య చేసి ఇంటి ముందర పడవేసిన సంఘటన సంచలనం రేపింది. బొల్లారం సిఐ రవీందర్ రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లారం కెబిఆర్ కాలనీలో నివాసం ఉంటున్న శ్రీను, రాధ దంపతుల కుమారుడు జయప్రకాష్ (22) భవన నిర్మాణ కార్మికునిగా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో స్నేహితులతో కలిసి బయటకు వెళుతున్నానని తల్లి రాధకు చెప్పి వెళ్లాడు. ఈ క్రమంలో జయప్రకాష్‌ను ఎక్కడో హత్య చేసి ఆదివారం తెల్లవారుజామున అయిదు గంటలకు ఇంటి ముందర పడేశారు.

తలసరి ఆదాయంలో దేశంలోనే తెలంగాణ నెంబర్ 1

- వ్యవసాయం, పారిశ్రామిక, సేవా రంగాల్లో స్థిరాభివృద్ధి
- రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా భావిస్తున్నదని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా పేరిట రూ. 30 వేల కోట్లు రైతుల పక్షాన బ్యాంకులకు రాష్ట్ర ప్రభుత్వం జమ చేసిందని గుర్తు చేశారు. సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతూ బ్యాంకింగ్ రికవరీ చరిత్రలో ఇదొక రికార్డు అని గుర్తు చేశారు. రైతులకు సకాలంలో రుణాలు ఇవ్వండి, ఆస్తుల తాకట్టు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేయాలని చెప్పారు. రైతులపై ఒత్తిడి చేయకూడదన్నారు. బ్యాంకర్లు మానవీయ కోణంలో ఆలోచించాలని సూచించారు. మన తెలంగాణ రాష్ట్రం దేశంలో తలసరి ఆదాయంలో (ప్రతి వ్యక్తి ఆదాయంలో రూ.3.87 లక్షలతో) అగ్రస్థానంలో నిలిచిందన్నారు. కర్ణాటక, హర్యానాలను అధిగమించి, ఐదేండ్ల తర్వాత తొలిసారి ఈ అగ్రస్థానాన్ని సాధించిందని అన్నారు. వ్యవసాయం పరిశ్రమలు, సేవా రంగం స్థిరమైన వృద్ధితో మొత్తంగా తెలంగాణ దేశంలోనే అత్యంత చురుకైన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా నిలిచి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. మనమందరం దీని నుంచి ప్రేరణ పొంది, మన ప్రజల సమగ్ర సంక్షేమం కోసం మరింత కృషికి ప్రతిజ్ఞ తీసుకోవాలన్నారు. తెలంగాణ రైసింగ్‌లో బ్యాంకర్ల పాత్ర ఉంది ఉన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరపు మొదటి త్రైమాసికంలో బ్యాంకులు ప్రాధాన్య రంగ రుణాల విభాగంలో మంచి ఫలితాలు సాధించటం పట్ల సంతోషంగా ఉందని తెలిపారు. ప్రాధాన్య రంగంలో వార్షిక ప్రణాళిక రుణ లక్ష్యాలలో మొదటి త్రైమాసికంలోనే 33.64 శాతం సాధించడం అభినందనీయం అన్నారు. రాష్ట్రం నిరంతరం అధిక రేషియోను కొనసాగించడం గర్వకారణమన్నారు. ఈ త్రైమాసికంలో ఇది 126.50 శాతంగా ఉందన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా భావించి, పలు పథకాలను అమలు చేస్తోందన్నారు. అర్హులైన రైతులకు రూ. 2 లక్షల వరకు పంట రుణాల ఉన్నాయన్నారు. వీటి ఫలితంగా వ్యవసాయం, అనుబంధ రంగాల వాటా పెరుగుతోందన్నారు. వీటిలో గణనీయ సంఖ్యలో కిసాన్ క్రెడిట్ కార్డు ఖాతాలు పునరుద్ధరించి, రైతులకు నిధులు విడుదల చేశామన్నారు. వ్యాపారానికి అనుకూలమైన, సృజనాత్మక విధానాలు ప్రభుత్వ చొరవల వల్ల రాష్ట్రంలో పెట్టుబడులు పెరిగి, పరిశ్రమల వృద్ధి, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయన్నారు. రైతుల పక్షాన రైతు రుణమాఫీ, రైతు భరోసా పేరిట రూ. 30 వేల కోట్లు రైతుల పక్షాన బ్యాంకులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించిందని డిప్యూటీ సిఎం తెలిపారు.

రాష్ట్రంలో 'ఏఐ' సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్

- ఆస్ట్రేలియా 'డికన్ యూనివర్సిటీ' భాగస్వామ్యంతో ఏర్పాటు
- మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో 'లెటర్ ఆఫ్ ఇంటెంట్'పై సంతకాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో 'ఏఐ' సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేసేందుకు ఆస్ట్రేలియాకు చెందిన ప్రముఖ విద్యాసంస్థ 'డికన్ విశ్వవిద్యాలయం' ముందుకొచ్చింది. ఇందుకు సంబంధించిన లెటర్ ఆఫ్ ఇంటెంట్(ఎల్‌వోఐ)పై సోమవారం డా.బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో 'డికన్ యూనివర్సిటీ' విసి ప్రొఫెసర్ ఇయాన్ మార్టిన్, ఐటీ శాఖ డిప్యూటీ సెక్రటరీ భవేష్ మిశ్రా సంతకాలు చేశారు. అనంతరం ఈ ఒప్పంద పత్రాలను పరస్పరం మార్పిడి చేసుకున్నారు. 'అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా ఏఐ రంగంలో తెలంగాణను గ్లోబల్ లీడర్‌గా తీర్చిదిద్దాలన్నదే మా ప్రభుత్వ సంకల్పం. ఎఐలో నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించాలనే లక్ష్యంతోనే ఈ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ఏర్పాటుకు డికన్ యూనివర్సిటీతో ఒప్పందం చేసుకున్నాం. ఇది కేవలం లాంఛనప్రాయ ఒప్పందం కాదు. రాబోయే రోజుల్లో కీలక రంగాల్లో తెలంగాణ, ఆస్ట్రేలియా మధ్య ద్వైపాక్షి సంబంధాల మెరుగుదలకు దిక్సూచీగా మారుతుంది. సమాజానికి ఉపయోగపడే అత్యాధునిక ఎఐ పరిష్కారాలను అభివృద్ధి చేయడంతో పాటు పరిశోధనలు, వ్యవస్థాపకతకు కొత్త అవకాశాలను సృష్టిస్తుంది' అని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు.

ఎఐ కోర్సుల రూపకల్పన, శిక్షణ, స్టార్టప్‌లకు చేయూత

'ఏఐ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ రంగాల్లో ప్రపంచానికి అత్యంత నైపుణ్యమున్న మానవ వనరులను తెలంగాణ నుంచే అందించాలని లక్ష్యంగా పెట్టుకుని, ఆ దిశగా చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాం. ఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, యంగ్ ఇండియన్ స్కిల్ యూనివర్సిటీ సంయుక్తంగా నేటి మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఏఐ కోర్సులకు రూపకల్పన చేసి, ఇక్కడి యువతకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన శిక్షణనిస్తాయి. మన ఏఐ స్టార్టప్ సంస్థలు అంతర్జాతీయ మార్కెట్‌లో తెలంగాణ బ్రాండ్‌ను మరింత విశ్వ వ్యాప్తం చేసేలా ఆస్ట్రేలియా నిపుణులు మార్గదర్శకత్వం చేస్తారు ' అని మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు.

ఎఐ ఆధారిత పౌర సేవలను అందించేలా...

'ఎఐ కేవలం ఒక సాంకేతికత మాత్రమే కాకుండా, సమ్మిళిత వృద్ధికి, మానవాభివృద్ధికి ఒక శక్తివంతమైన సాధనంగా మార్చేలా మా ప్రభుత్వం పకడ్బందీ ప్రణాళికలను రూపొందించి అమలు చేస్తోంది. ఈ లక్ష్య సాధనలో ఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ మార్గదర్శిగా మారుతుంది. ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, గవర్నెన్స్ తదితర రంగాల్లో ఎఐ వినియోగాన్ని పెంచి పౌర సేవలను మరింత సమర్థవంతంగా అందించేలా సంయుక్త పరిశోధనలు నిర్వహిస్తాం. ప్రస్తుతం సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు ఎఐ ఆధారిత పరిష్కారాలను కనుగొనేందుకు కృషి చేస్తాం' అని తెలిపారు.



అందుకే ఇక్కడ ఏర్పాటు చేస్తున్నాం
- ప్రొఫెసర్ ఇయాన్ మార్టిన్

'ఏఐలో తెలంగాణను గ్లోబల్ లీడర్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి ప్రశంసనీయం. ప్రజల శ్రేయస్సు కోసం సమర్థవంతమైన, బాధ్యతాయుతమైన ఎఐ పరిష్కారాలను అందించాలనే లక్ష్యంతోనే భారత్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నాం. ఇందుకోసం తెలంగాణ అన్ని రకాలుగా అనుకూలంగా ఉందని గుర్తించాం. అందుకే ఇక్కడ ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చాం' అని డికన్ యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ ఇయాన్ మార్టిన్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కాన్సూల్ జనరల్ (ఆస్ట్రేలియన్ కాన్సూలేట్- జనరల్ బెంగళూరు) స్టీవెన్, కాన్సూల్ ఆండ్రూ కాలిస్టర్, ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్ మెంట్ కమిషనర్ వికా సింగ్, పొలిటికల్ అండ్ ఎకానమిక్ రీసెర్చ్ ఆఫీసర్ రంజని మాధవన్, డికన్ యూనివర్సిటీ ప్రతినిధులు రౌనీత్ పాహ్వా, ప్రియాంక సింగ్, గాయత్రి వేద్ నారాయణన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా పోరాడాలి

- రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆశయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా వృత్తిదారులంతా పోరాడాలని రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య పిలుపునిచ్చారు. విద్యుత్ ఉద్యమ అమరవీరుడు.. రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర మాజీ కన్వీనర్ సత్తెనపల్లి రామకృష్ణ 25వ వర్ధంతి సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని గోల్కొండ చౌరస్తాలోని సిఐటియు సిటీ ఆఫీసులో 'ఉచిత విద్యుత్ పథకం- ఎదురవుతున్న సవాళ్లు' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. సంగం రాష్ట్ర అధ్యక్షులు ఎదునూరు మధార్ అధ్యక్షతన జరిగిన ఈ సెమినార్‌లో ఆశయ్య మాట్లాడారు. విద్యుత్ అమరవీరుల ఆశయాల దారిలో పయనించాలని, విద్యుత్‌రంగం ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని సూచించారు. కేంద్రం విద్యుత్ ప్రయివేటీకరణ బిల్లును పార్లమెంటులో ఆమోదించి రాష్ట్రాల విద్యుత్ సంస్థలను కేంద్ర ప్రభుత్వ చట్ట పరిధిలోకి తెచ్చి.. ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టి స్మార్ట్ మీటర్ల విధానం తీసుకురావాలని కుట్ర పన్నుతుందన్నారు. దాని వల్ల పేదలకు, రైతులకు భవిష్యత్‌లో ఉచిత విద్యుత్ పథకాలు ఉండవని ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో రజక, క్షౌర, చేనేత వివిధ వృత్తిదారులకు ఇస్తున్న సబ్సిడీకి ప్రభుత్వం ఏటా నిధులు కేటాయించకపోవడంతో బకాయిలు పెరిగిపోయాయని, అధికారులు వృత్తిదారులను బిల్లులు కట్టాలని వేధిస్తున్నారని తెలిపారు.

ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. వృత్తిదారుల సంక్షేమం, ఆధునీకరణ, ఉపాధికి కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని కోరారు. రూ.10 కోట్లతో 10 జిల్లాల్లో మోడ్రన్ ధోబీఘాట్లు నిర్మిస్తామని చెప్పారని, ప్రతి వృత్తిదారుడికీ రూ.10 లక్షల రుణం, రజక ఫెడరేషన్‌కు ఏటా వెయ్యి కోట్ల బడ్జెట్, పాలకవర్గాల నియామకాలను ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. అమరవీరుల ఆశయ సాధనలో వృత్తిదారుల హక్కుల కోసం భవిష్యత్‌లో అనేక ఉద్యమాలు చేపడతామన్నారు. గొర్రెల, మేకల పెంపకదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడత రవీందర్ మాట్లాడుతూ.. విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా ఆనాడు వామపక్షాలు, ప్రజాసంఘాలు చేసిన పోరాట ఫలితంగా అనేక హక్కులు సాధించుకున్నామని తెలిపారు.

గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ్‌నాయక్, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, నాయకులు గుమ్మడిరాజు నరేష్, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.బాలకృష్ణ, సి.మల్లేష్, జ్యోతి ఉపేందర్, మరియాల గోపాల్, సి.వెంకటస్వామి, యాదమ్మ, ఎస్.సుభద్ర, పి.భాస్కర్, సట్టు రవి, కె.యాదగిరి, సిహెచ్.నగేష్, అల్వాబాబు పాల్గొన్నారు.

కేంద్రం తప్పుడు విధానాలే బీడీ పరిశ్రమ సంక్షోభానికి కారణం

- తెలంగాణ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు కాముని గోపాలస్వామి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రం తప్పుడు విధానాలే బీడీ పరిశ్రమ సంక్షోభానికి కారణమని తెలంగాణ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు కాముని గోపాలస్వామి అన్నారు. లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న బీడీ పరిశ్రమ రక్షణపై డిసెంబర్‌లో మెదక్‌లో జరిగే మహాసభల్లో చర్చించనున్నట్టు తెలిపారు. సిఐటియు రాష్ట్ర మహాసభల సందర్భంగా 'బిడి పరిశ్రమ పరిరక్షణ, కార్మికుల పాత్ర' అంశంపై మెదక్ జిల్లా నిజాంపేట మండల కేంద్రంలో సోమవారం సెమినార్ నిర్వహించారు. బీడీ కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి బాలమణి అధ్యక్షతన జరిగిన ఈ సెమినార్‌లో గోపాలస్వామి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ తప్పుడు విధానాల ఫలితంగానే బిడి పరిశ్రమ కుదేలై లక్షలాది మంది ఉపాధి కోల్పోతున్నారన్నారు. జిఎస్‌టి పేరుతో బీడీ పరిశ్రమను ప్రణాళికాబద్ధంగానే దెబ్బ తీసి మినీ సిగరెట్ పరిశ్రమలకు పరోక్షంగా సహకరిస్తుందని తెలిపారు. 2014లో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పించే చిన్న పరిశ్రమలు దెబ్బ తీసి కార్పొరేట్లకు ఊడిగం చేసే పనిలో ఉన్నారని విమర్శించారు. జిఎస్‌టి విధించడం, పుర్రె గుర్తు సైజు పెంచడం, తునికాకు సేకరణపై అటవీ శాఖ ఆంక్షలను సాకుగా చూపి బీడీ



కార్మికులకు ప్రస్తుతం ఇచ్చే హక్కుల్లో కోత విధించడం యాజమాన్యాలకు సాకుగా మారిందన్నారు. మరోవైపు రాష్ట్రప్రభుత్వమూ బీడీ కార్మికులపై సవతి తల్లి ప్రేమ చూపుతోందన్నారు.

కనీస వేతనం పెంచకపోవడం, కొత్త వారికి జీవన భృతి మంజూరు చేయకపోవడం, ప్రస్తుతం ఉన్నదాన్ని పెంచడం కూడా చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు తప్ప వేరే మార్గం లేదన్నారు. కార్మిక పోరాటాల సారథి సిఐటియు రాష్ట్ర మహాసభల జయప్రదానికి బీడీ కార్మికులు కృషి చేయాలని, అన్ని తరగతుల వారూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టేకిదారుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సిద్ధిరాములు, జిల్లా అధ్యక్షులు నారాయణ, సిఐటియు మెదక్ జిల్లా కార్యదర్శి ఏ.మల్లేశం, నిజాంపేట మండల నాయకులు నీలం బాబు, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

ప్రాణహిత-చేవెళ్లను పునరుద్ధరిస్తాం

- తుమ్మిడిహట్టి బ్యారేజీకి ప్రణాళికలు
- హెలిబోర్న్ సర్వేకు రెండు హెలికాప్టర్లు సిద్ధం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పూర్తికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. అందుకు అనుగుణంగా తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. వచ్చే డిసెంబర్ నాటికి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి చేసుకున్న దరిమిలా రాష్ట్రంలోని ప్రాజెక్టుల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆయన సూచించారు. సోమవారం రోజున నీటిపారుదల శాఖ ప్రధాన కార్యాలయం జలసౌధలో జరిగిన నీటిపారుదల శాఖ సమీక్షలో ఆయన పాల్గొని రాష్ట్రంలోని ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు. నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్‌జీవన్‌పాటిల్, సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ శివకుమార్‌నాయుడు, ఇఎన్‌సిలు అంజద్ హుస్సేన్, మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మొదలు పెట్టిన చేవెళ్ల-ప్రాణహితను కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాల్సిన ప్రాజెక్టుల్లో సమ్మక్క- సారక్క ప్రాజెక్టుకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. అందులో భాగంగా ఈ నెల 23న ఢిల్లీలో కేంద్ర జలవనరుల సంఘం సమావేశానికి హాజరై ఆ ప్రాజెక్టుకు నీటి కేటాయింపులతో పాటు టెక్నికల్ అడ్వైజరీ కమిటీ నుంచి అనుమతి తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో చర్చించి అనుమతులు తీసుకోవాలని ఆయన సూచించారు. సీతారాం సాగర్, మోడికుంట వాగు, చనాకా-కొరాట డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థతోపాటు చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుల నిర్మాణాలకు కావాల్సిన నిధులను కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదల చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేసి కేంద్రానికి పంపాలన్నారు. కృష్ణా జలాల వివిధ ట్రిబ్యునల్ విషయమై సుప్రీంకోర్టులో ఈ నెల 23-25న వాదనలు ఉన్నాయనీ, అంతకు ముందే సుప్రీంకోర్టు న్యాయవాది సి.ఎస్.వైద్యనాథ్‌తో చర్చలు జరగనున్నాయన్నారు.

జాతీయ డ్యామ్‌ల పరిరక్షణ సంస్థ(ఎన్‌డిఎస్ఎ) చేసిన సూచనలకు అనుగుణంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ బ్యారేజీలను పునరుద్ధరణ ఉంటుందన్నారు. బ్యారేజీలను పునరుద్ధరించడంలో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతతో ఉందన్నారు. కాగా ఎన్‌డిఎస్ఎ సూచనలకు అనుగుణంగా పనులు ముందుకు సాగుతాయని ఆయన స్పష్టం చేశారు. అయితే అదే సమయంలో ఐఐటి వంటి సంస్థలతో నిర్మాణానికి సంబంధించిన అంశాలను పరీక్షించేలా చర్యలు తీసుకోవడంతో పాటు వరదలు తగ్గిన వెంటనే పనులు చేపట్టేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. వచ్చే ఏడాది వానాకాలం లోపు పనులు పూర్తి చేయాలన్నారు. అన్నింటికీ మించి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, పునరావాసంతో పాటు అటవిశాఖా అనుమతుల వంటి ప్రక్రియను సత్వరమే పూర్తి చేయాలన్నారు. కొడంగల్-నారాయణపేట ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అలాగే డిండి, ఎస్ఎల్‌బిసి, పెండ్లిపాకల, నక్కలగండి ప్రాజెక్టుల భూసేకరణను వేగవంతం చేయాలన్నారు.

జూరాల ప్రాజెక్టు బ్రిడ్జిపై రోజు రోజుకు ట్రాఫిక్ రద్దీ పెరుగుతున్న దృష్ట్యా ప్రత్యామ్నాయంగా మరో బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి అక్కడి ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేయాలని ఆయన చెప్పారు. వచ్చే మంత్రివర్గ సమావేశానికి ముందే దేవాదుల ప్యాకేజ్3, 6 పనుల పురోగతిపై నివేదిక సమర్పించాలని ఆయన చెప్పారు. ప్రస్తుతం జూరాల, నాగార్జునసాగర్, ఎస్ఆర్ఎస్‌పి నిజాంసాగర్, హుస్సేన్‌సాగర్ తదితర ప్రాజెక్టులలో పూడిక తీత పనులు ప్రారంభించబోతున్నట్టు చెప్పారు. ఇప్పుడు చేపట్టిన పూడిక తీత పనుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రూ.500 కోట్ల రాబడి ఉంటుందని, రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించినట్టయితే ప్రభుత్వానికి రూ.3000 కోట్ల నుంచి రూ.4వేల కోట్ల వరకు రాబడి వస్తుందన్నారు. అన్నింటికి మించి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ఎస్-ఎల్‌బిసి పనుల పునరుద్ధరణకు గానూ నిర్వహించతలబెట్టిన హెలిబోర్న్ సర్వేకు రెండు హెలికాప్టర్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. టన్నెల్ సమీపంలో హెలిబోర్న్ ఏరియల్ మాగ్నెటిక్ సర్వే ఏర్పాట్లను మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

లెన్‌డెన్‌క్లబ్‌కు రూ.34 కోట్ల లాభాలు

న్యూఢిల్లీ : గడిచిన ఆర్థిక సంవత్సరం 2024-25లో రూ.34 కోట్ల నికర లాభాలు సాధించినట్లు రుణాల జారీ సంస్థ లెన్‌డెన్‌క్లబ్ గ్రూప్ వెల్లడించింది. ఇంతక్రితం ఏడాది రూ.14 కోట్ల నష్టాలు చవి చూసింది. ఇదే సమయంలో రూ.185 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. గడిచిన ఆర్థిక సంవత్సరంలో 28 శాతం పెరిగి రూ.236 కోట్లకు పెరిగిందని ఆ సంస్థ తెలిపింది.

బైబిట్ పునరుద్ధరణ..

హైదరాబాద్ : ప్రముఖ క్రిప్టో ఎక్స్ఛేంజీ బైబిట్ భారత్‌లో తన యాప్, వెబ్‌సైట్ సేవలను తిరిగి ప్రారంభించినట్లు తెలిపింది. సెప్టెంబర్ 8 నుంచి గూగుల్ ప్లే స్టోర్‌లో పునరుద్ధరించినట్లు పేర్కొంది. వెబ్‌సైట్ మరో 3-4 రోజుల్లో అందుబాటులోకి వస్తుందని తెలిపింది. కేంద్ర ప్రభుత్వ పిఎంఎల్ఎ నిబంధనలకు లోబడి లావాదేవీలను నిర్వహించనున్నట్లు ఆ సంస్థ సిఇఒ బెన్ జో పేర్కొన్నారు.

నగరంలో 16 నుంచి సిఐఐ ఎఫిషియెన్సీ సమ్మిట్

హైదరాబాద్ : ప్రముఖ పారిశ్రామికవేత్తల సంఘం సిఐఐ ఆధ్వర్యంలో 24వ ఎనర్జీ ఎఫిషియెన్సీ సమ్మిట్ 2025ను హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. నగరంలోని హైటెక్స్‌లో 16-18 తేదీల్లో జరగనుందని నిర్వాహకులు తెలిపారు. తక్కువ కార్బన్ ఆర్థిక వ్యవస్థను వేగవంతం చేయడంపై ఈ సమావేశం దృష్టి కేంద్రీకరిస్తుందన్నారు. ఇంధన సామర్థ్యం, స్థిరత్వం కోసం ఆవిష్కరణలను ప్రోత్సహించేలా చర్చలు జరుగుతాయని పేర్కొన్నారు. దీనికి 2,500 పైగా ప్రతినిధులు, 100 పైగా వక్తలు హాజరు కానున్నారని తెలిపారు.

ఆదాయం ఆర్జించే శాఖల్లో బదిలీలపై నిషేధం ఎత్తివేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఆదాయాన్ని ఆర్జించే శాఖలైన వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖల్లోని ఉద్యోగుల బదిలీలపై ప్రభుత్వం నిషేధాన్ని ఎత్తేసింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా సోమవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఉద్యోగుల సాధారణ బదిలీలపై రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించిన విషయం తెలిసిందే. ఆయా శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీలకు అనుమతి ఇస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం బదిలీలుంటాయని స్పష్టం చేశారు.

21 నుంచి దసరా సెలవులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈనెల 21 నుంచి రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు, ఎయిడెడ్ పాఠశాలలకు ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించింది. వచ్చేనెల మూడో తేదీ వరకు సెలవులుంటాయని అకడమిక్ క్యాలెండర్‌లోనే స్పష్టం చేసింది. పాఠశాలలకు 13 రోజులపాటు సెలవులుంటాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు, ఎయిడెడ్ జూనియర్ కాలేజీలకు ఈనెల 28 నుంచి వచ్చేనెల ఐదో తేదీ వరకు దసరా సెలవులుంటాయి. జూనియర్ కాలేజీలకు ఎనిమిది రోజులపాటు ఇంటర్ బోర్డు సెలవులను ప్రకటించింది. వచ్చేనెల నాలుగో తేదీన పాఠశాలలు, ఆరో తేదీన జూనియర్ కాలేజీలు తెరుచుకుంటాయి.

'మెఫెడ్రోన్ కేసు మా పరిధి కాదు'

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మెఫెడ్రోన్ డ్రగ్స్ వ్యవహారం మా పరిధిలోనిది కాదని డ్రగ్ కంట్రోల్ అథారిటీ (డిసిఎ) తెలిపింది. ఈ మేరకు సోమవారం డిసిఎ జాయింట్ డైరెక్టర్ రమదాన్ ఒక ప్రకటన విడుదల చేశారు. చర్లపల్లి ప్రాంతంలోని వాగ్దేవి లాబొరేటరీస్ ఒక కెమికల్ ఫ్యాక్టరీ మాత్రమేననీ, ఔషధ తయారీ లైసెన్స్ పొందలేదనీ, ఫార్మాస్యూటికల్ కంపెనీ కూడా కాదని ఆయన తెలిపారు. అలాగే మెఫెడ్రోన్ అనే పదార్థం ఔషధం కాదని ఆయన స్పష్టం చేశారు. ఇది డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ పరిధిలోకి రాదని ఆయన స్పష్టతనిచ్చారు. ఈ వ్యవహారం మొత్తం ఎన్‌డిపిఎస్ చట్టం-1985 ప్రకారం పోలీస్, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సిబి), డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డిఆర్ఐ), ఇతర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని చట్టాలను అమలు చేసే సంస్థల పరిధిలోకే వస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో డిసిఎకు ఎలాంటి చర్యలు తీసుకునే అధికారం లేదా బాధ్యత ఉండదని జాయింట్ డైరెక్టర్ వివరించారు.

మరో గ్రంథాలయ ఉద్యమానికి మార్గం వేద్దాం

- రాష్ట్ర గ్రంథాలయ చైర్మెన్ డాక్టర్ రియాజ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మరో గ్రంథాలయ ఉద్యమానికి మార్గం వేద్దామని రాష్ట్ర గ్రంథాలయ చైర్మెన్ డాక్టర్ రియాజ్ అన్నారు. ప్రపంచ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా సోమవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్క్ నుంచి చిక్కడపల్లి సిటీ సెంట్రల్ లైబ్రరీ వరకు 'పుస్తకాలతో నడక-వాక్ విత్ బుక్స్' అనే కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాలయ ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి, ప్రజల్లో అక్షరాస్యత పెంపు, పుస్తకాలు చదివే అలవాటును పెంచడం కోసం ఈ కార్యక్రమంలో పుస్తక ప్రియులు, రచయితలు, గ్రంథాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రియాజ్ మాట్లాడుతూ.. ఒంటరిగా ఉన్న మనిషికి అక్షరం ప్రపంచాన్ని పరిచయం చేస్తుందని, ప్రపంచాన్ని పరిచయం చేసుకున్న మనిషి నూతన నాగరికత దిశకు నడిపిస్తాడని తెలిపారు. ఆ క్రమంలోనే అక్షరాస్యతను, పుస్తకాలు బాగా చదివే అలవాటును పెంచాలని సూచించారు. గ్రంథాలయ ఉద్యమం ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో గ్రంథాలయ అభివృద్ధికి, పుస్తకాలను చదువరులకు మరింత చేరువ చేయడం కోసం గ్రంథాలయ సంస్థ అనేక కార్యక్రమాలు చేపట్టబోతుందని వివరించారు సెల్‌ఫోన్‌ల కన్నా పుస్తకాలతో ఎక్కువ గడపాలని సూచించారు. పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు చదువు పట్ల నిబద్ధత నేర్పించి.. రోజువారీగా గ్రంథాలయానికి గంట సమయం కేటాయించాలని, ఆ దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. గ్రంథాలయల అభివృద్ధి యువతను చెడు అలవాట్ల నుంచి దూరం చేస్తుందని, శాస్త్ర సాంకేతిక రంగాల్లో యువత మరింత విస్తారంగా వెళ్లే అవకాశం ఉందని తెలిపారు.

కమర్షియల్ ట్యాక్స్, మైనింగ్ శాఖల రాబడుల్లో పెరుగుదల

- డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కమర్షియల్ ట్యాక్స్ శాఖలో 4.7 శాతం, మైన్స్ శాఖలో 18.6 శాతం పెరుగుదల ఉండగా, ఇతర శాఖల్లో ఆదాయ సమీకరణలో వెనుకబాటు కనిపిస్తోందని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర ఆదాయ వనరుల సమీకరణ సబ్ కమిటీ సమావేశం కమిటీ చైర్మన్ డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో కమిటీ సభ్యులు, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. భారీ సాగునీటి ప్రాజెక్టుల్లో పూడికతీత పనులను వేగవంతం చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులకు సూచించారు. ఈ పూడికతీత పనులతో సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి నిలువ సామర్థ్యం పెరగడంతో పాటు ఇసుక ద్వారా రాష్ట్రానికి ఆదాయం సమకూరుతుందనీ మంత్రి ఉత్తమ్ వివరించారు. మొదట ఒక ప్రాజెక్టులో పూడికతీత కార్యక్రమాన్ని వెంటనే ప్రారంభించాలని సూచించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఇసుక తవ్వకం పనులను పూర్తిగా ట్రైబల్ ఏజెన్సీల ద్వారా నిర్వహించాలని మంత్రులు సూచించారు. గిరిజనులకు ఐటిడిఎలోని ఇంజనీరింగ్ విభాగం యంత్ర సామాగ్రిని అందించాలని మంత్రులు సూచించారు. దీని ద్వారా ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనులు ఆర్థికంగా బలోపేతం అయ్యే అవకాశం ఉంటుందని మంత్రులు తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కాలుష్యకారక పరిశ్రమల తరలింపునకు మూడు వారాల్లో విధి విధానాలు రూపొందించాలని మంత్రులు సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఆర్ అండ్ బి స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్, సిసిఎల్ఎ కమిషనర్ లోకేష్ కుమార్, కమర్షియల్ ట్యాక్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, మైనింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, మైన్స్ డైరెక్టర్ శశాంక, స్టాప్స్ అండ్ రిజిస్ట్రేషన్ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు, ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ సురేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

12న ఫార్మసిస్ట్ పోస్టులకు జాబ్ మేళా

- వంద ఫార్మసిస్ట్ పోస్టుల భర్తీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉస్మానియా యూనివర్సిటీలోని ఎంప్లాయిమెంట్ బ్యూరో ఆధ్వర్యంలో మెడ్‌ప్లస్ ఫార్మసీ ఆధ్వర్యంలో ఈ నెల 12న ఉదయం 11 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ, ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న ఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యాలయంలో ఈ జాబ్ మేళా నిర్వహించనున్నారు. అపోలో ఫార్మసీలోని ఫార్మాసిస్టు, అసిస్టెంట్ ఫార్మసిస్ట్‌లకు చెందిన 100 పోస్టులను ఈ జాబ్ మేళా ద్వారా భర్తీ చేయనున్నారు. డి ఫార్మసీ, బి ఫార్మసీ, ఎం.ఫార్మసీ, డిగ్రీ చేసిన యువతీ, యువకులకు 18 నుంచి 35 సంవత్సరాల వయసు వారికి మాత్రమే ఈ జాబ్ మేళాలో అవకాశం కల్పిస్తున్నట్టు యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో డిప్యూటీ చీఫ్ ఒక ప్రకటనలో తెలిపింది. రూ.12,000 నుంచి రూ.25,000 వరకు వేతనం ఉండే ఈ ఫార్మసిస్ట్ ఉద్యోగాలకు సంబంధించి మరిన్ని వివరాలకు హెచ్‌ఆర్ రఘుపతిని ఫోన్ నెంబర్ 8247656356లో సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు. విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్‌తో ఉస్మానియా యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ బ్యూరో వద్ద నేరుగా శుక్రవారం హాజరు కావాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

2030 నాటికి 140 కోట్లకు చేరనున్న వృద్ధులు

- కిమ్స్ హాస్పిటల్‌లో ఫిజియోథెరపీ దినోత్సవంలో వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్

భవిష్యత్తుల్లో అధిక వయసు గల వారి సంఖ్య అధికమవుతుందన్నారు కిమ్స్ రీహాబిలిటేష్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ సుధీంద్ర వూటూరి. అంతర్జాతీయ ఫిజియోథెరపీ దినోత్సవాన్ని పురస్కరించుకొని కిమ్స్ హాస్పిటల్స్‌లో ఫిజయోథెరపీ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2030 నాటికి ప్రపంచంలో 60 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు కలిగిన వారు సుమారు 140 కోట్ల మందిగా ఉంటారని, 2050 నాటికి ఇది 210 కోట్లకు పెరిగే అవకాశముందని పేర్కొన్నారు. ఎక్కువ మంది ఎక్కువ కాలం జీవించే పరిస్థితిలో, వృద్ధుల్లో చలనం, బలం, శ్రేయస్సు కలిగించేందుకు ఫిజియోథెరపీ వంటి మద్దతు వ్యవస్థలు ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది ఫిజియోథెరపిస్టులు, ఫిజియోథెరపీ, ఆరోగ్య సాహాయ్య విభాగాల విద్యార్థులు హాజరయ్యారు.

ఇహెచ్‌ఎస్ విధివిధానాలు సిద్ధం చేయండి

- అధికారులకు సిఎస్ ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఇహెచ్‌ఎస్) విధి విధానాలను సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రతిపాదిత ఇహెచ్‌ఎస్ విధి విధానాలపై సోమవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో సీనియర్ ఐఎఎస్ అధికారులతో సిఎస్ సమీక్షించారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఇతర రాష్ట్రాల్లో ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి అమలవుతున్న వివిధ పథకాలను, ఇన్సూరెన్స్ కంపెనీల విధానాలను అధ్యయనం చేసి సాధ్యమైనంత త్వరలో నివేదికను సిద్ధం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు వారి వేతనం నుంచి కొంత డబ్బును జమ చేసేందుకు సిద్ధంగా ఉన్నారనీ, నగదు రహిత ఆరోగ్య చికిత్స విధానం ద్వారా ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు నగదు రహిత వైద్యం అందించాలని కోరుతున్నారని అధికారులు వివరించారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు కలిపి మొత్తం 7,14,322 మంది ఈహెచ్‌ఎస్ ద్వారా లబ్ధి పొందనున్నారని అన్నారు. ఈ పథకం కోసం ఏడాదికి సుమారు రూ.1,300 కోట్ల అంచనా వ్యయం అవుతుందని అధికారులు ప్రకటించారు. దీనికి సంబంధించి వైద్య ఆరోగ్య శాఖ, ఆర్థిక శాఖ అధికారులు సమన్వయంతో ఆయా రాష్ట్రాల్లో కొనసాగుతున్న ఇహెచ్‌ఎస్ విధి విధానాలను అధ్యయనం చేసి త్వరలో నివేదికను సిద్ధం చేయాలని సిఎస్ ఆదేశించారు. ఈ సమావేశంలో హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, విద్యా శాఖ కార్యదర్శి యోగితారాణా, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు, జెఎడి కార్యదర్శి బెన్హర్ మహేష్ దత్ ఎక్కా ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

టెట్‌పై ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం జరపాలి : టిఆర్‌టిఎఫ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపాధ్యాయులకు టెట్ తప్పనిసరి చేస్తూ ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ఉపాధ్యాయ సంఘాలతో ప్రభుత్వం సమావేశాన్ని జరపాలని టిఆర్‌టిఎఫ్ కోరింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈ నవీన్ నికోలస్‌ను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కటకం రమేష్ సోమవారం హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. టెట్ నిబంధనల కన్నా ముందు నియామకమైన ఉపాధ్యాయులకు గతంలో ఎన్‌సిటిఇ మినహాయింపునిచ్చిందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 2011లో 51 జీవోను ఇచ్చిందని తెలిపారు. దాన్ని పరిశీలించి అవసరమైతే సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని కోరారు. ఉపాధ్యాయులకు ఒక సమాచారాన్ని ఇచ్చేందుకు సమావేశాన్ని నిర్వహిస్తే బాగుంటుందని సూచించారు.